6,7న జెఎన్‌టియుజివిలో సాంకేతిక సింపోజియం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు జివిలో ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ అఫ్ మెటటార్జికల్ విభాగం ఆధ్వర్యంలో వచ్చే నెల మార్చి 6,7 తేదీల్లో సాంకేతిక సింపోజియం జరుగుతుందని విసి ప్రొఫశ్రీసర్ కె.వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను విసితో పాటు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ ,హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.మణికుమార్, ఆ విభాగ అధ్యాపకులు, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఇటువంటి సింపొజియంలలో విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా పరిజ్ఞానం ఇచ్చి పుచ్చుకోవడానికి ఉపయోగ పడుతుందని అన్నారు. తద్వారా భవిష్యత్తులో వారు ఎంచుకున్న మార్గాలను (లక్ష్యాలను) త్వరితగతిన చేరుకోవడానికి ఉపయోగ పడతాయని తెలిపారు.

తగ్గిన రబీ విస్తీర్ణం

- ఇకెవైసికి మూడురోజులే గడువు
- ఆర్‌బికెల్లోనే నమోదు
- సాంకేతిక లోపాలుంటే తహశీల్దార్, ఎఒల అంగీకార పత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రబీ పంటల సాగు విస్తీర్ణం జిల్లాలో ఏటా తగ్గుతోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతోపాటు పెరిగిన మదుపు, కనీస మద్దతు ధర కల్పించకపోవడం, దళారుల దోపిడీ వంటి కారణాలవల్ల రెండో పంటలపై రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది రబీ పంటల సాగు దాదాపు ముగిసింది. ఈ సీజన్‌లో మొక్కజొన్న, మినుములు, పెసలు ఆ తరువాత స్థానంలో రాగులు, వరి సాగవుతాయి. ఇతర అపరాలు, చిరుధాన్యాలు అంతంత మాత్రంగానే సాగవుతాయి. రబీ సాధారణ విస్తీర్ణం 1,62,305 ఎకరాలు కాగా, ఈ ఏడాది 1,00,621 ఎకరాల్లో మాత్రమే సాగైంది. గత ఏడాదితో పోలిస్తే 28,775 ఎకరాలు, సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 61684 ఎకరాల విస్తీర్ణం తగ్గింది. కేవలం 62శాతం విస్తీర్ణంలోనే సాగు కనిపిస్తోంది. వర్షాలు అనుకూలించకపోవడం, వాతావరణ పరిస్థితులే ఇందుకు కారణమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇక సాగును ఒక్కసారి గమనిస్తే.... అత్యధికంగా మొక్కజొన్న 43,933 ఎకరాల్లో సాగైంది. ఆ తరువాత స్థానంలో మినుములు 34,649 ఎకరాలు, పెసలు 13,805 ఎకరాలు, రాగులు 24,88 ఎకరాలు, వరి 796ఎకరాల్లో సాగయ్యాయి.

పంటల బీమా సదుపాయ ప్రక్రియలో భాగంగా ఇకెవైసి నమోదుకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈనెల 23వ తేదీలోపు రైతులంతా స్థానిక ఆర్‌బికెలకు వెళ్లి వేలిముద్రలు (ఇకెవైసి) నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు నమోదు చేసుకున్నవారికి మాత్రమే పంటల బీమా వర్తించే అవకాశం ఉంటుందని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. 1,00,621 ఎకరాల రబీసాగులో 55,813 మంది రైతులకు చెందిన 94,719 ఎకరాల పంటలను వ్యవసాయ శాఖ సిబ్బంది ఇ-క్రాప్ బుకింగ్ చేశారు. వీరిలో కేవలం 44,843 మంది రైతులు మాత్రమే ఇకెవైసి నమోదు చేయించుకున్నారు. మిగిలిన 10,970 మంది ఈనెల 23వ తేదీలోపు నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీరిలో 3,352 మంది రైతులు లీగల్, ఆధార్ సాంకేతిక సమస్యలతో ఉన్నట్టుగా సమాచారం. ఇటువంటి వారంతా స్థానిక తహశీల్దార్, మండల వ్యవసాయ శాఖ అధికారి అంగీకారపత్రాలు తప్పనిసరిగా సమర్పించాల్సి వుంటుంది. ఆ తరువాతే ఇకెవైసి ప్రక్రియ పూర్తి అవుతుంది. సహాయ సహకారాలకోసం రైతులు తమను సంప్రదించవచ్చని ఆర్‌బికె సిబ్బంది, మండల వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పంటల బీమాతోపాటు పంటల కొనుగోలు, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి వ్యవసాయ, ఉద్యాన రంగాలకు చెందిన పథకాలు పొందాలంటే ఇ-క్రాప్ బుకింగ్‌తోపాటు ఇకెవైసి నమోదు కూడా ప్రభుత్వం తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. మన జిల్లాలో వరి, మొక్కజొన్న, పెసలు, మినుము పంటలకు మాత్రమే బీమావర్తించే విధంగా ప్రభుత్వం నోటిఫైడ్ చేసింది.



ఇకెవైసి చేస్తున్న సిబ్బంది

మంచి జరిగితేనే అండగా నిలవండి

టిడ్కో ఇళ్ల పంపిణీలో మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే తమ ప్రభుత్వానికి అండగా నిలవాలని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. స్థానిక సోనియానగర్‌లో రూ.33.56 కోట్లతో నిర్మించిన 448 టిడ్కో ఇళ్లను మంగళవారం మంత్రి చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఇంటి తాళాలను, పత్రాలను అందజేశారు. పట్టు వస్త్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు చేరాయని, అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ అందాయని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడానికి, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయడానికి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి కృషితో విజయనగరం పట్టణం రూపురేఖలు మారాయని అభినందించారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, ప్రజలు నివాస యోగ్యానికి అవసరమైన అన్ని వసతులను కల్పించిన తరువాతే, లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం గోడలు లేపేసి, ఇళ్ళు పూర్తి చేసినట్లు మమ అనిపించారని విమర్శించారు. అప్పుడు ఎంపిక చేసిన లబ్ధిదారులకే ఇళ్లు ఇచ్చామన్నారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, సారిపల్లి, సోనియానగర్ లో మొత్తం 3,600 ఇళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ కాలనీల్లో రోడ్లు, విద్యుత్, డ్రెయిన్లు, తాగునీరు కల్పనతో పాటు అంతర్గత రహదారులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడ్కో ఛైర్మెన్ జమ్మాన ప్రసన్న కుమార్, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, మచ్చు లయా యాదవ్, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, మెప్మా పీడీ సుధాకర రావు, ట్రాన్స్ కో ఎస్ఇ లక్ష్మణరావు, కార్పొరేటర్లు, టిడ్కో అధికారులు, కో ఆప్షన్ సభ్యులు, హౌసింగ్ కమిటీ సభ్యులు, జోనల్ ఇంచార్జీలు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు టిడ్కో ఇంటి పట్టాలను అందజేస్తున్న విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

పాఠశాల తరగతి గదులు ప్రారంభం

స్థానిక కొత్తపేట కుమ్మరి వీధిలో స్వామి వివేకానంద నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు- నేడు ఫేజ్ 2 కింద రూ.24 లక్షలతో నిర్మించిన రెండు తరగతి గదులను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు.

గాంధీ విగ్రహావిష్కరణ

ఎంజి రోడ్డులో ట్యాంకు బండ్ ప్రక్కన రు.60 లక్షలతో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని, ఫౌంటైన్ ను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, భారత జాతిపిత, మహాత్మా గాంధీ విగ్రహం పట్టణానికి తలమానికమని పేర్కొన్నారు. పట్టణంలో గాంధీ విగ్రహం లేని లోటు ఇన్నాళ్లకు తీరిందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, కలెక్టర్ నాగలక్ష్మి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిఇఒ ఎన్. ప్రేమ్ కుమార్, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ తిరుమల రావు, ఎంఇఒలు, తహశీల్దార్ పివిరత్నం తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహావిష్కరణలో బొత్స, కోలగట్ల, బెల్లాన

చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎంఎల్‌సి సురేష్‌బాబు తదితరులు

కల్యాణమస్తుతో బాలికా విద్యకు తోడ్పాటు

370 జంటలకు రూ.2.35 కోట్లు విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాల కింద కులాంతర వివాహ ప్రోత్సాహాల నిమిత్తం ఇస్తున్న పారితోషికం బాలికా విద్య ప్రోత్సాహానికి తోడ్పాటు నిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పథకాల కింద వధూవరులు ఇద్దరూ పదో తరగతి ఉత్తీర్ణులై వుండాలనే నిబంధనల కారణంగా పేద కుటుంబాల్లోని బాలబాలికలు తప్పనిసరిగా పదోతరగతి పూర్తి చేస్తున్నారని చెప్పారు.కళ్యాణమస్తు, షాదీ తోఫా ఆర్ధిక సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. జిల్లాలో ఐదో విడతలో 370 జంటలకు రూ.2.35 కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేశారు. వీరిలో 296 మంది బిసి., ఓసి 1, ఎస్‌సి 60, ఎస్‌టి 13జంటలు వున్నాయి. వీటిలో ఒకే కులంలో జరిగిన వివాహాలకు సంబంధించి 331మందికి, కులాంతర వివాహాలు చేసుకున్న జంటలు 34, విభిన్నప్రతిభావంతులు ఐదుగురు వున్నట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని యీ పథకం లబ్దిదారులకు రూ.2.35 మొత్తం విడుదలకు సంబంధించిన చెక్కును కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు అందజేశారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్‌తో పాటు ఎంఎల్‌సి సురేష్‌బాబు, డిసిసిబి ఛైర్మన్ వేచలపు చినరామునాయుడు, డిసిఎంఎస్ ఛైర్మన్ అవనాపు భావన, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణచక్రవర్తి, డిఎస్‌డబ్ల్యుఒ రామానందం, మైనారిటీ సంక్షేమ అధికారి రుద్రపాటి శామ్యూల్ జాన్ పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిల కోసం

ఉద్యోగ ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎపి జెఎసి పిలుపులో భాగంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు మంగళవారం కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. తొలుత జెడ్‌పి కార్యాలయం నుంచి ఎత్తు బ్రిడ్జి, ఆర్‌అండ్‌బి జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ, కార్యదర్శి సురేష్, పెద్దింటి అప్పారావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా, రావాల్సిన బకాయిలు చెల్లించకుండా తీవ్రఅన్యాయం చేసిందన్నారు. ఉద్యోగుల పక్షపాతి అని చెప్పుకుంటూ ఉద్యోగులకు ఉపయోగకరమైన చర్యలు చేపట్టడం లేదన్నారు. దాచుకున్న డబ్బు ఎపి జిఎల్ఐ, జిపిఫ్, గ్రాట్యుటీ వంటి డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం ఉద్యోగులకు అన్యాయం చేస్తుందన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెఎసి ప్రస్తుత అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమేష్ చంద్ర పట్నాయక్, పి.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, సదాశివరావు, కె.విజయగౌరి, కె.జోగారావు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీ, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు తవుడు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాజు, అప్పలనాయుడు, మహిళా విభాగం నాయకులు ఆదిలక్ష్మి, శ్రీ స్వప్న రాధిక , జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌బాబు, ఆనంద్ కుమార్, కనకరాజు, పెన్షనర్ సంఘ అధ్యక్షులు కార్యదర్శులు నారాయణరావు, పెద్దింటి అప్పారావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ధర్నా చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న సిఐ వెంకటరావు, యుటిఎఫ్ నాయకులు

విద్యను ప్రోత్సహించడంలోనూ ఎస్ఎఫ్ఐ ముందంజ

ప్రజ్ఞా విజ్ఞాన పరీక్ష విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పోరాటాల్లోనే కాదు విద్యను ప్రోత్సహించడంలోనూ ఎస్ఎఫ్ఐ ముందుంటుందని వక్తలు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఇటీవల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదాన కార్యక్రమం మంగళవారం జెడ్‌పి మినిస్టీరియల్ హాలులో జరిగింది. ఒకటవ పట్టణ సిఐ వెంకట్రావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జివికె జిల్లా కన్వీనర్ కె .శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐ వెంకటరావు మాట్లాడుతూ విద్య నేర్చుకునేందుకు పాఠ్య పుస్తకాలే కాకుండా సమాజం కోసం ఉపయోగపడే పుస్తకాలను కూడా చదవాలని సూచించారు. ఇలాంటి పరీక్షలు రాయడం ద్వారా విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షల ముందు ఉండే భయాన్ని తొలగించవచ్చని, మానసికంగా బలోపేతం కావడానికి బాగా ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి ప్రథమ స్థానం సాధించిన వై.కృష్ణవర్ధన్ (రవీంద్ర భారతి స్కూల్, ఎస్.కోట)కు మెమొంటో, రూ.5వేలు నగదు బహుమతి, రెండోస్థానంలో నిలిచిన ఎం.ఆశా దీపిక (నారాయణ ఒలింపియాడ్, విజయనగరం)కు మెమొంటోతో పాటు రూ.3వేలు నగదు బహుమతి, తృతీయ స్థానం సాధించిన పి.సౌభాగ్య (ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, నెలిమర్ల) కు మెమొంటో, రూ.2వేలు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి.రమేష్, ఎస్.సోమేష్, రాజు,వంశీ, డేవిడ్, మణి, సంధ్య పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వకుంటే బతికేదెలా?

నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల సమ్మె సందర్భంగా గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ రాత పూర్వకంగా ఇచ్చిన హామీలకు వెంటనే జీవోలు ఇవ్వాలని, ఆప్కాస్‌లో లేని కార్మికులకు థర్డ్ పార్టీ విధానం రద్దు చేసి, నగరపాలక సంస్థ నేరుగా జీతాలు చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎ.జగన్మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలు తరబడి జీతాలు ఇవ్వక పోతే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్మికుల సమ్మె కాలపు జీతం, సంక్రాంతి కానుక కానుక రూ'.1000 వెంటనే ఇవ్వాలన్నారు. 2 నెలలు హెల్త్ అలవెన్స్ బకాయిలు, 3ఏళ్ల సరెండర్ లీవ్ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పంప్ హౌస్, లీకుల్లో పనిచేసే కార్మికులకు 2 నుంచి 6 నెలలు బకాయి జీతాలు చెల్లించాలని, బట్టలు, సబ్బులు, నూనెలు, చెప్పులు తదితర రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.వాటర్ వర్క్స్, పంప్ హౌస్ కార్మికులకు సర్వీస్, అర్హతను బట్టి స్కిల్, సెమి స్కిల్ వేతనాలు చెల్లించే విధంగా రీజనల్ డైరెక్టర్‌కు ప్రతిపాదన పంపాలన్నారు. విలీన ప్రాంత కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాల డిమాండ్ చేశారు.ధర్నాలో అప్పలరాజు, సూర్యనారాయణ, ఈశ్వరమ్మ, వరలక్ష్మి, బాబురావు, జగదీష్ కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

జల్‌జీవన్ మిషన్ పనుల పర్యవేక్షణకు కమిటీ

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామ జలసంఘాల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ విధానంలో చేపట్టే జల్‌జీవన్ మిషన్ పనులు పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎస్‌ఇ., జెడ్‌పి సిఇఒ, జిల్లా పంచాయతీ అధికారి, డిఆర్‌డిఎ పీడీ, డిడబ్ల్యుఎంఎ పీడీ, సమగ్రశిక్ష ప్రాజెక్టు ఇఇ, గ్రామీణ నీటిసరఫరా, సహజవనరుల నిర్వహణ, సమాజాభివృద్ధి రంగంలో నిపుణులైన ఒకరు సభ్యులుగా వుంటారని గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎస్ఇ ఉమాశంకర్ తెలిపారు.ఈ కమిటీ గ్రామాల్లో చేపట్టిన పనులను పర్యవేక్షిస్తుందన్నారు. ఈ పనుల నిర్వహణలో వచ్చే సాంకేతిక, పరిపాలన పరమైన సమస్యల పరిష్కారం, పనులు చేపట్టేందుకు అవసరమైన సామాగ్రి సమకూర్చడంలో సహాయపడేందుకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎస్ఇ పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ సూపర్ సిక్స్ కిట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల కిట్లు ప్రతి ఇంటికీ కార్యకర్తలు చేరవేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.అదితి గజపతి కోరారు. మంగళవారం విజయనగరం నియోజకవర్గ సమా వేశం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో జరిగింది. ఆమె మాట్లాడుతూ బూత్ ఇన్‌ఛార్జిలు, పార్టీ నాయకులు అందరూ కలిసి రోజుకు 50 ఇళ్లకు వెళ్లి ప్రతి ఇంటి వద్ద "బాబు సూపర్ సిక్స్" హామీలను వివరించాలన్నారు, నారా లోకేష్ ఇచ్చిన కిట్ ద్వారా క్యాలెండర్, జాబు క్యాలెండర్‌ను ప్రతి ఇంటికీ ఇవ్వాలన్నారు. వైసిపి ప్రభుత్వ అసమర్ధ, అరాచక పాలనపై వారిలో చైతన్యం తీసుకు రావాలన్నారు. కుటుంబ సాధికార సారథులను పూర్తి స్థాయిలో నియమించుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం నారా లోకేష్ పంపిన కిట్ లను బూత్ ఇన్‌ఛార్జులకు అదితి గజపతి రాజు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినా యుడు, వేచలపు శ్రీనివాసరావు, సర్పంచు లు,ఎంపిటిసిలు, బూత్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు కిట్లు అందజేస్తున్న అదితి గజపతి

మిమ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ముగిసిన 36 గంటల నిరసన ధర్నా ● కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని , మొండిగా వ్యవహరిస్తున్న మిమ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట మిమ్స్ ఉద్యోగులు చేపట్టిన 36 గంటల నిరసన ధర్నా మంగళవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ మాట్లాడుతూ స్వాతంత్ర్య రాకముందు నుంచి పెద్ద ఎత్తున పోరాడి కార్మిక చట్టాలను సాధించుకున్నారని తెలిపారు. అందులో సంఘం పెట్టుకునే హక్కు కూడా ఉందన్నారు. అందులో ఆఫీస్ బేరర్స్‌లో 50శాతం బయట వ్యక్తులు ఉండవచ్చునని, కానీ మిమ్స్ యాజమాన్యం దీన్ని ఖాతరు చేయకుండా కార్మిక హక్కులను హరిస్తూ ఉద్యోగులను కట్టు బానిసల్లాగా చేస్తూ దోచుకుంటుందని అన్నారు. ఈ నిర్ణయాలను వ్యతిరేకించిన ఉద్యోగులు యూనియన్ ద్వారా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోకుండా యాజమాన్య మాటలను, చర్యలను సమర్థిస్తున్నారన్నారు. జనవరిలో చేసిన విధులకు నేటివరకు జీతం ఇవ్వలేదన్నారు. నెలలో ఏడో తేదీ లోపు జీతం ఇవ్వకపోతే ఆ యాజమాన్యంపై జరిమానాతోపాటు కేసు నమోదు చేయవచ్చునని తెలిపారు. కానీ జిల్లా అధికారులు గాని, కార్మికశాఖ అధికారులు గాని చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు కలుగజేసుకొని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, చర్చలు జరిపి ఉద్యోగులు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్. హరీష్, మిమ్స్ ఉద్యోగులు ఎం.నారాయణ రావు, కామునాయుడు, మధు, రాంబాబు, నాగభూషణం, బంగారునాయుడు, మూర్తి, పైడిరాజు, స్వర్ణలత, గౌరీ, భవాని దేవి, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రాస్తారోకో చేస్తున్న మిమ్స్ ఉద్యోగులు

పెదతాడివాడలో ఆరోగ్య సురక్ష

దెంకాడ: మండలంలోని పెదతాడివాడ గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్ - 2 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు పరిశీలించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లవరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బల్లిగాంపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. ఈ వైద్య శిబిరానికి 407 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 136 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కె రాజు, వైద్యులు ఎస్.నాగమణి, రజిత, సిహెచ్ ఈశ్వరరావు, వైద్య సిబ్బంది, గ్రామ సర్పంచ్ దండుపాటి ముత్యాలమ్మ, పిటిసి చామంతి, లక్ష్మి, చామలాపల్లి గ్రామ సర్పంచ్ కోల సతీష్, పంచాయతీ కార్యదర్శి ధన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాటిపాడులో బోనాల పండగ

రేగిడి: మండలంలోని తాటిపాడులో మంగళవారం భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గాథం కుటుంబీకులు, గ్రామస్తులు ఆరాధ్య దేవతగా కొలిచే శ్రీరామ అమ్మవారి పేరంటాలకు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. స్థానిక వైసిపి నాయకులు, సర్పంచ్ బూరాడ నాయుడు, రామనాయుడు, రామినాయుడు, రామ్మోహనరావు మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా భీష్మ ఏకాదశిన కొండపైన యాత్ర మహోత్సవాలు నిర్వహిస్తుంటామని గ్రామస్తులు, కమిటీ నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం

నెల్లిమర్ల: రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ నెల 17నుంచి 19వరకు అనకాపల్లి జిల్లా నాగులపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల జట్టు పాల్గొని ప్రథమ స్థానం సాధించి కప్ తో బాటు రూ.40వేలు బహుమతి కైవసం చేసుకుని అందుకున్నారు. ఈ క్రీడాకారులను సిఐటియు ప్రధాన కార్యదర్శి, వీడి బొమ్మన రామారావు, కబడ్డీ సంఘం అధ్యక్షులు బోని సూర్యనారాయణ తదితరులు అభినందించారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయండి

బొబ్బిలి: మున్సిపల్ కార్మికులు 16 రోజుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు అమలు చేయకపోవడం అన్యాయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ కి వినతిపత్రం ఇచ్చారు. మున్సిపల్ కార్మికులు ఉంటున్న వీధి వెనుక పాత కంపోస్ట్ యార్డ్ మురికి నీరు క్లీనింగ్ ప్లాంటుకు ఆ భూమిని తీసుకోవడం అన్యాయమని ఆ భూమి మున్సిపల్ కార్మికుల ఇళ్ల స్థలాలకు కేటాయించారని అక్కడ ఎటువంటి పనులు ప్రారంభించినా అడ్డుకుంటామని తెలియజేశారు. యూనియన్ అధ్యక్షులు జి. గౌరీ నాయకులు బి. యుగంధర్ కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా వివేకానంద స్వామి జాతర

వేపాడ: మండలంలోని ఆకుల సీతంపేట గ్రామంలో వివేకానంద స్వామి 57వ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని వివేకానంద స్వామికి పూజలు నిర్వహించారు. కోలాటం, భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బుధవారం గుర్రపు పరుగు పందాలు, ఎడ్ల పరుగు పందాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

వేపాడ: మండలంలోని గుడివాడలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎపిఒ ఆదిలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, ఎండ ఎక్కువ కాకముందే పనులు ముగించుకోవాలని, పనుల వద్ద వేతనదారులకు మంచినీరు సిద్ధం చేయాలని సూచించారు. తప్పుడు మస్టర్లు వేసినట్లు తన దృష్టికి వస్తే క్షేత్ర సహాయకునిపై తగు చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.

కొబ్బరికి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి

పూసపాటిరేగ: కొబ్బరి రైతుకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కొబ్బరి రైతులు కోరారు. మంగళవారం కొబ్బరి రైతులతో నాబార్డ్ డీడీఎం నాగార్జున సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పైడితల్లమ్మ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ గురించి చర్చ జరిగిందని కొకొనట్ ప్రొడ్యూసర్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ మొంగం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి కృషి చేయాలని, ఎరువులు పురుగు మందులు రైతులకు అందుబాటులో ఉంచడానికి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టడానికి ప్రోత్సహించడానికి, కొబ్బరి రైతుల అభివృద్ధి చేయడానికి, తెల్ల దోమ నివారణ కోసం కృషి చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పైడితల్లమ్మ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ప్రెసిడెంట్ ఎరుకయ్య దొర, సెక్రటరీ అప్పడు దొర, డైరెక్టర్ రౌతు సాయి కుమార్, సీతకు, సీరతండ్ర వర్మ, పాల్గొన్నారు.

9న జాతీయ లోక్‌అదాలత్

రాజాం: రాజాం కోర్టు ఆవరణలో మార్చి 9న జాతీయ లోక్ అదాలత్‌ను ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తామని మండల న్యాయ సేవా సంఘ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎం. బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులను ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, బాధితులు

హుదూద్ ఇళ్లు అప్పగించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టాలిచ్చిన వారికి హుదూద్ ఇళ్లు అప్పగించాలని కోరుతూ మంగళవారం హౌసింగ్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ 2014లో హుదూద్ తుపాను వల్ల ఇళ్లు కోల్పోయిన పేదలకు 2019 ఎంఆర్ పట్నం వద్ద 432 మందికి ఇళ్లు నిర్మించి పట్టాలిచ్చారని, కానీ నేటివరకు కరెంటు, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కల్పించలేదని అన్నారు. దీంతో అక్కడ నివాసం ఉంటున్న వారికి మౌలికసదుపాయాలు లేక నరక యాతన అనుభవిస్తున్నారన్నారు. కావున తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని, లబ్ధిదారులకు అధికారులు ఇళ్లు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం హౌసింగ్ డిఇకి వినతి అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పి.రమణమ్మ, జగదాంబ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువరానివి

విజయనగరం టౌన్: ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువరానివని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్, రెగ్యులర్ కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. మహిళలు ఒక్కొక్కరికి మూడు చీరలు, రవికలు, తువ్వాలు, పురుషులకు మూడు జతల ఏకరూప దుస్తులు, మూడు తువ్వాళ్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 622 మంది పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ చేసామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, సహాయ కమిషనర్ తిరుమల రావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబ మూర్తి, కార్పొరేటర్లు కంటుబుక్త తవిటిరాజు, సడిపిల్లి ఆదినారాయణ పాల్గొన్నారు.

యాదవ సంఘాల ఐక్యవేదిక 36గంటల ధర్నా

విజయనగరం కోట: జిల్లాలో అన్ని రాజకీయ పార్టీలు విజయనగరం అసెంబ్లీ టిక్కెట్, ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ యాదవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం 36గంటల నిరవధిక ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యాదవ ఐక్యవేదిక బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ముద్దాడ మధు మాట్లాడుతూ గత 45రోజులుగా యాదవులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఏ జిల్లాలో లేని విధంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా యాదవులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. యాదవ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బిస్సు సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ విజయనగరం అసెంబ్లీ, ఎమ్మెల్సీ సీటు కోసం యాదవ్ గర్జన, పలు పార్టీల అధ్యక్షులకు వినతులు ఇచ్చామని, స్పందించకపోవడంతో 36గంటల ధర్నా చేపట్టామని తెలిపారు. ఇప్పటికీ స్పందించకపోతే రానున్న రోజుల్లో పార్టీ కార్యాలయాల ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పడాల గణేష్, బిసి సంఘ నాయకులు గొలగాని రమేష్ యాదవ్, జిల్లా యాదవ సంఘ అధ్యక్షులు సతీష్ యాదవ్, నమ్మి ప్రసాద్, బి.జగ్గారావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - భోగాపురం

వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఎ.రావివలసలో సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి ఆధ్వర్యంలో పలు నూతన భవనాలను వారు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిని ఓడించేందుకు అన్ని పార్టీలూ ఏకమవుతున్నాయన్నారు. వారిచ్చే డబ్బులు తీసుకుని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. అంతకు ముందు రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, 22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, 17 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. పంచాయతీలో ఉన్న 17 స్వయం సహాయక సంఘాలకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ద్వారా రూ.1.64 కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, తహశీల్దార్ శ్యాంప్రసాద్, ఎంపిడిఒ చంద్రకళ, డిఇ బంగారునాయుడు, నాయకులు పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, మైలపల్లి నరసింహులు, కర్రోతు వెంకటరమణ, పైకి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కును అందిస్తున్న జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే

వైసిపికి బుద్ధి చెప్పాలి : బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

నియోజకవర్గంలో తమపై ప్రత్యర్థులు పోటీ చేసేందుకు భయపడేలా టిడిపికి మెజారిటీ వస్తుందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. కోటలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అధికార వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. తమపై ప్రత్యర్థులు పోటీ చేసేందుకు భయపడేలా టిడిపికి మెజారిటీ వస్తుందన్నారు. అలజంగి గ్రామంలో ప్రజలను భయపెట్టి వైసిపికి కొంత మందిని తిరిగి ఆ పార్టీలో చేర్చుకుందన్నారు. చేరికలు సభలో తనపై, అలజంగి టిడిపి నాయకులపై వైసిపి నాయకులు అవాకులు చవాకులు పేలడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు రూపంలో ప్రజలు బుద్ధి చెపుతారన్నారు. టిడిపిలో చేరిన జానీను, సర్పంచ్ భర్త బుజ్జిపై అసభ్యంగా మాట్లాడడం అన్యాయమన్నారు. డబ్బులు ఎర చూపి అలజంగి నుంచి అధిక సంఖ్యలో బయలుదేరించారని, పింఛను, అమ్మఒడి, సంక్షేమ పథకాలు ఆపివేస్తామని వాలంటీర్లతో బెదిరించి తీసుకువచ్చారని చెప్పారు. ఓటు నచ్చిన వారికి వేసుకుని సమావేశానికి రావాలని ఒత్తిడి చేశారన్నారు. అలజంగిలో టిడిపికి అత్యధిక మెజారిటీ వస్తుందన్నారు. గొల్లాది వంతెన నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. బొబ్బిలి పౌరుషాన్ని, బొబ్బిలి గౌరవాన్ని అపహాస్యం చేసేలా అధికారాన్ని విజయనగరం నాయకులు వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. ధాన్యం డబ్బులు రైతులకు సకాలంలో చెల్లించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. వెంగలరాయసాగర్, పారాది ఆనకట్టు కాలువలు దుస్థితి అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఎరువులు సకాలంలో ఇవ్వడం లేదని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి నాయకులు తలెత్తుకుని తిరగలేని విధంగా టిడిపికి మెజారిటీ వస్తుందన్నారు. అలజంగి వద్ద తోటపల్లి కాలువకు గండి పడడంతో పంటలు నష్టపోయిన పట్టించుకోలేదన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు రేజేటి బుజ్జి, బి.వెంకట రావు, రెడ్డి ప్రసాద్, పి.వెంకటరమణ తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై వాడీవేడిగా చర్చ

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై వాడివేడిగా చర్చ జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షత కౌన్సిల్ సమావేశం జరిగింది. మున్సిపల్ షాపులు అద్దెలు పెంచేందుకు తీర్మానాన్ని పెట్టగా అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు బొత్స రమణమ్మ, ఇంటి గోవిందరావు, ఎస్.రామకృష్ణబాబు, చోడిగంజి రమేష్ నాయుడు అభ్యంతరం చెప్పి తీర్మానాన్ని వాయిదా వేయాలని కోరారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపులు రూ. లక్షల్లో అద్దె బకాయి ఉంటే ఎందుకు వసూలు చేయడం లేదని ప్రశ్నించారు. అద్దె వసూలు చేస్తామని, అద్దె చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్‌ఒ ప్రసాద్ చెప్పారు. మున్సిపల్ సాధారణ నిధులతో సుందరీకరణకు, లైటింగ్‌కు ఖర్చు చేయడం సరికాదని, ప్రజా అవసరాలకు సాధారణ నిధులు ఖర్చు చేయాలని, సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని టిడిపి కౌన్సిలర్ రాంబర్కి శరత్ డిమాండ్ చేశారు. మురికివాడల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేయడం లేదని, పారిశుధ్య పనులు బాగా చేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వైస్ చైర్మన్ జి.రమాదేవి కోరారు. మున్సిపల్ షాపులు బినామీల పేరుతో కొన్ని నడుస్తున్నాయని, దీంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుందని, బినామీలపై చర్యలు తీసుకోవాలని టిడిపి ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వాలంటీర్లు మరింత మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి పేరు తీసుకు రావాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల, నగర పంచాయతీ పరిధి వాలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, ఎంపిపి అంబళ్ళ సుధారాణి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, ఏఎంసి చైర్మన్ చిక్కాల అరుణ కుమారి, వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, నగర పంచాయతీ ప్రెసిడెంట్ చిక్కాల సాంబ శివరావు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఎంపిడిఒ జి.రామారావు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, సర్పంచులు, ఎంపిటిసిలు వార్డు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: వైసిపికి వాలంటీర్లే స్టార్ క్యాంపెయినర్లు అని ఎమ్పి బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన్న అప్పలనాయుడు, జిల్లా జెసిఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలు అద్భుతమన్నారు. ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజల వద్దకే చేరువేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీర్ల వ్యవస్థను రూపొందించారని గుర్తుచేశారు. అనంతరం వాలంటీర్లకు ఎమ్పి చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేసి దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆంజినేయులు, జెడ్‌పిటిపి రామారావు, నాయకులు శంకర్ రావు, తెంటు మధుసూదన్ పాల్గొన్నారు.

మీడియాపై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి- బొబ్బిలి

మీడియాపై దాడి చేయడం దుర్మార్గమని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు, పట్టణ కళాసీ సంఘం నాయకులు వై.అప్పారావు అన్నారు. ఎబిఎన్ ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై రాప్తాడులో జరిగిన దాడికి వ్యతిరేకంగా గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దేశంలో ప్రజా సమస్యలపై పని చేస్తున్న మీడియా ప్రతినిధులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభ కవరేజ్ చేస్తుండగా దాడి చేస్తే కనీసం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు రాంబర్కి శరత్, కె.లక్ష్మి, వి.హైమవతి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, జర్నలిస్టులు కె.శ్రీనివాసరావు, రఫీ, రమేష్, జగన్, పాల్గొన్నారు.

నెల్లిమర్ల: పాత్రికేయులపై దాడులను అందరూ ముక్తకంఠంతో ఖండించాలని నెల్లిమర్ల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ మీద జరిగిన దాడిని ఖండిస్తూ డిప్యూటీ తహశీల్దార్ శైలజకు, ఎస్ఐ రామగణేష్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత్రికేయులపై దాడి అత్యంత హేయమైన చర్య అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నెల్లిమర్ల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పతివాడ రాజారావు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆల్తి శ్రీనివాసరావు, కల్యాణం సత్యనారాయణ, రేగులవలస భాస్కరరావు, వసాది సూరిబాబు, బాలి గౌరినాయుడు తదితరులు ఉన్నారు.

ఉన్నత విద్యలో సెంచూరియన్ భేష్

గిరిజన వర్సిటీ వైస్‌ఛాన్సలర్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉన్నత విద్యలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం ముందంజలో వుందని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ టి.వి. కట్టిమని కొనియాడారు. మంగళవారం ఆయన సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఇక్కడ అమలు చేస్తున్న కోర్సులు, నైపుణ్య విద్య గురించి ఆయన వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఇక్కడ ప్రయోగశాలలు, పేపర్ లెస్ పరీక్షల విధానం, జైరో ప్లేన్ తయారు, బ్యాటరీ ఆటోల తయారీ యూనిట్, రోబోటిక్స్, కంప్యూటర్ న్యూమెరికల్ కంట్రోల్ యూనిట్, కుట్టు యంత్రాల యూనిట్, టిష్యూ కల్చర్, పాలి హౌస్ తదితర వాటిని పరిశీలించి ఇక్కడ ప్రయోగశాలలు, ఇతర రకాల సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు ప్రయోగాత్మకంగా విద్యను బోధించడానికి వీలుగా అన్ని పరికరాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, డాక్టర్ పుష్పలత, ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డాక్టర్ సన్నీ డియోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్. వర్మ, డాక్టర్ దీపక్, డాక్టర్ అరుణ్ కుమార్, కిషోర్ మహాపాత్రో, గిరిజన వర్సిటీ నుంచి డాక్టర్ అనిరుద్ కుమార్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రతి ఒక్కరూ చట్టాలు గురించి అవగాహన కల్పించుకోవాలని జిల్లా జడ్జి దుర్గయ్య అన్నారు. మంగళవారం కొల్లాం గ్రామంలో ప్రజా ప్రయోజిత సేవలు, శాశ్వత లోక అధాలత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల బాలికల, మహిళలు గురించి ప్రభుత్వం అనేక చట్టాలను ప్రవేశ పెట్టిందన్నారు. ఈ చట్టాలు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వెనుకబడిన తరగతులు రిజర్వేషన్లు కల్పించడం వల్ల పేదరికం నిర్మూలన అవుతుందని దీని వల్ల సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయని నిర్మూలన చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. బాలకార్మికులతో పనిచేయిస్తే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. గ్రామాలలోని చిన్న చిన్న సమస్యలను పెద్దలకు సమక్షంలో పరిష్కారం చేయించుకోవాలని కోర్టు వరకు రాకూడదని సూచించారు. వృద్ధులైన తల్లిదండ్రులను సక్రమంగా చూడకపోయినా పిల్లలు శిక్షార్హులవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నియర్ కంటేశ్వర్ రెడ్డి, ఐసిడిఎస్ పిఒ భారతి, గ్రామ నాయకులు కరక శ్రీను, గ్రామ కార్యదర్శి ధనంజయులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - కొత్తవలస

వ్యవసాయ రంగంలో బిందు, తుంపర్ల సేద్యం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు పొందవచ్చని హార్టికల్చర్ అధికారి పద్మ తెలిపారు. మంగళవారం గులివిందాడలో మామిడి, బొప్పా యి డ్రిప్ ఇరిగేషన్ పథకాల లబ్ధిదారుడు వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె క్షేత్రస్థాయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న చిన్నా సన్న కారు రైతులకు 90శాతం రాయితీతో ఐదు ఎకరాలు దాటిన రైతులకు 50 శాతం రాయితీతో బిందు, తుంపర్ సేద్యం పరికరాలను ప్రభుత్వం అందిస్తుందని వాటిని రైతులు సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ ఏపిఎస్ఎన్ మూర్తి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ దుర్గారావు, ఫీల్డ్ కో ఆర్డినేటర్ వైవి రమణ, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి- దెంకాడ

మండలంలోని చొల్లంగిపేటలో జీరోటిల్లేజ్ విధానంలో వేసిన మొక్కజొన్న పంటను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కజొన్నలో నానో యూరియా పై అవగాహన కల్పించారు. మొక్కజొన్నలో నానో యూరియ వాడటం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు రవాణా ఖర్చు కూడా రైతుకు మిగులుతుందని చెప్పారు. మామూలు యూరియా వాడేటప్పుడు అది మొక్కకు 50శాతం మాత్రమే ఉపయోగపడుతుందని అదే నానో యూరియా వాడినట్లయితే 100శాతం పూర్తిగా మొక్కకు అందుతుందని చెప్పారు. పైగా చీడపీడల ఉధృతి కూడా తగ్గుతుందన్నారు. భూమికి కూడా ఎటువంటి నష్టం జరగదని చెప్పారు. ఎడిఎ నాగభూషణరావు మాట్లాడుతూ ఈ పంట నమోదు బుధవారంతో ముగుస్తుందని, ఈ క్రాప్ ఇకెవైసి కూడా మూడు రోజుల్లోపు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి నిర్మల, ఎఇఒ ఎం ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి- దెంకాడ

మండలంలోని రాజపులోవ సచివాలయ వాలంటీరు రౌతు పైడిలక్ష్మికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తన నివాసంలో మంగళవారం రూ.4.50లక్షల సిఎం సహయ నిధి చెక్కును అందించారు. పైడిలక్ష్మి భర్త రాముకు ఇటీవల కాలంలో బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సిఎం సహాయ నిధి గురించి దరఖాస్తు చేయగా మంజూరైంది. ఆ చెక్కును ఎమ్మెల్యే ఆమెకు అందించారు.

నెల్లిమర్ల: సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజల పక్షపాతి అని ఎమ్మెల్సీ డాక్టర్ పి.వి.వి. సూర్యనారాయణ రాజు అన్నారు. మంగళవారం మొయిదలో సీఎం సహయ నిధి చెక్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఆ గ్రామానికి చెందిన శీర వెంకట్రావు ప్రమాదంలో మరణించడంతో ఎమ్మెల్సీ కృషితో ఆ కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి 2.20 లక్షలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సంతోష్ బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, నాయకులు ధవళ లక్ష్మణరావు, వై. కృష్ణ, టి.శంకరరావు పాల్గొన్నారు.

బొబ్బిలి: పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఆపదలో అండగా ఉంటుందని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. నియోజకవర్గంలో పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఐదుగురుకు రూ.10.10లక్షల మంజూరు కాగా ఆ చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడగంజి రమేష్ నాయుడు, వైసిపి నాయకులు బలగ సాయికృష్ణ, చప్ప శేఖర్, గొట్టాపు అప్పారావు, ఉన్నారు.

చింతలపాలెంలో తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని చింతలపాలెం సర్పంచ్ మాకిన నవీన్ పాత్రుడు ఆహ్వానం మేరకు చిట్టిపాప తీర్థ మహోత్సవంలో మాజీ మంత్రి బండారు సత్యన్నారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సతావధాని డాక్టర్ బులుసు అపర్ణ నిర్వహించిన సాహిత్య గోష్టి కార్యక్రమాన్ని వీక్షించారు. ఉదయం నుంచి హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. తప్పెటగుళ్ళు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహాభారతంలోని పలు ముఖ్య ఘట్టాలపై బులుసు అపర్ణ చేసిన ప్రసంగం పలువుర్ని ఆకట్టుకుంది. కార్యక్రమంలో వల్లూరి జయప్రకాష్ బాబు, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు ఈర్లే శ్రీరామమూర్తి, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి నాయకులు గొరపల్లి శివ, బొడ్డు అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

భోగాపురం: ఎన్నికల్లో ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని తహశీల్దార్ పి. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని రావాడ సమీపంలోని అవంతి కళాశాలలో మంగళవారం ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసి ఎన్నికల సమయంలో వినియోగించుకోవాలన్నారు. భవిష్యత్తు తరాలను మార్చగలిగే సత్తా యువతతోనే సాధ్యమ న్నారు. అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవా లన్నారు. ఈ కార్యక్రమ ంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్ పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE COURT OF THE IVth ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
E.P.NO.413/ 2022
Arbitration.Case. NO: VPD / CIFCO / 079 / 2020 / HL03VZI000008781

Between:-
M/s. Cholamandalam Investments and Finance Co.,Ltd., rep by its power of Attorney Holder: Malla Maheswara Rao S/o Late Mr.Malla Bhadrachalam,
.....Decree Holder

And :-
01. Mr.Balaji Balla,
02. Smt. Balla Satya ....Judgment Debtors

Notice to Judgment Debtors No.1&2

01. Mr.Balaji Balla, S/o Papa Rao, Hindu, Aged about 39 Years, D.No: 765 Phoolbagh colony, Hanumanth statue, Vizianagaram -535002.
02. Smt. Balla Satya, W/o Balaji, Hindu, Aged about 30 Years, residing at Door.no:765 Phoolbagh colony, Hanumanth statue, Vizinagaram-535002

Take Notice that the above EP is posted for issuance of notice to both of you. therefoe you are to appear before the Hon'ble Court of The IVth Additional District Judge at Vizianagaram on **26-02-2024 at 10.30 A.M** personally or through an Advocate.

Smt. Gorle Sowjanya Laxmi
Advocate for Decree Holder
Srikakulam, cell:9160764533

విధ్వంస పాలనకు స్వస్తి పలకాలి : కిమిడి

ప్రజాశక్తి- చీపురుపల్లి

విధ్వంస పాలన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజల సిద్ధంగా ఉన్నారని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం చీపురుపల్లిలో తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ పాలనలో విధ్వంసం తప్ప అభివృద్ధి లేదు అనే విషయం ప్రజలందరికి తెలుసన్నారు. జగన్ సిద్ధం అని సభలు పెట్టి అసంబద్ధ మాటలు చెపుతున్నారన్నారు. 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్క చాన్సే జగన్‌కు రాజకీయంగా చివరి చాన్స్ అవుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచెయ్యడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారని, ఓటమి భయంతో బదిలీలు అంటూ 77 మందిని జగన్ మడతపెట్టాడని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్ల రూపాయలు దారి మళ్లించిన జగన్ పై దళిత సోదరులు యుద్ధానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ రెడ్డి పేరు చెబితే బాబాయిపై గొడ్డలి వేటు, కోడికత్తి శ్రీను, ప్రభుత్వ టెర్రరిజం, క్విడ్ ప్రోకో, ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియా గుర్తొస్తాయన్నారు. జగన్ పేరు చెపితే అధిక ధరలు, పన్నులు, ఛార్జీల పెంపు, అప్పులు, బాదుడు, మోసాలు, దొంగ ఓట్లు, హింసా రాజకీయాలు గుర్తొస్తాయని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కళ్యాన్‌పై తాజాగా కేసు పెట్టడాన్ని నాగార్జున ఖండించారు.

ఆంగ్లభాషకు ఫొనీటిక్స్ కీలకం

బొబ్బిలిరూరల్: ఆంగ్లభాషా ఉచ్చారణలో ఫొనీటిక్స్‌దే కీలక పాత్ర అని కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రావాడ భాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళ వారం పెంట ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాష సబ్జెక్ట్ పాఠశాల సముదాయం నిర్వహించారు. ఈ నేపథ్యంలో డాక్టర్ రావాడ భాస్కరరావు వెయ్యి ఆంగ్ల పదాలకు ఫొనీటిక్స్‌ను రాశారు. వాటిని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు తన స్వంత నిధులు వెచ్చించి 100 పుస్తకాలను అచ్చువేయించి ఆంగ్ల భాష బోధిస్తున్న ఉపాధ్యాయులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా డి.ఆర్.పి రమణ, వేణు, అప్పారావులు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా విచ్చేసిన డాక్టర్ రావాడ, పెంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నారావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు ఈ పుస్తక ప్రతులను విడుదల చేసి ఉపాధ్యాయులకు అందించారు. రావాడ మాట్లాడుతూ నేటి కాలపరిస్థితుల్లో ఆంగ్ల భాష పరిజ్ఞానం చాలా అవసరమని ఆంగ్లభాషను బోధించే ఉపాధ్యాయులు భాషపై ప్రావీణ్యతను పెంపొందించుకోవాలని కోరారు. పుస్తకాలను రూపొందించిన జెసి రాజును అభినందించారు. కార్యక్రమంలో డిఆర్‌పిలు అప్పారావు, వెంకట రమణ, వేణు, సిఆర్‌పి లక్ష్మీ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపు పేటలో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం స్థానిక ఎస్ఐ డి. రామ గణేష్ అందించిన వివరాలు ప్రకారం.. జరజాపు పేట దళిత కాలనీకి చెందిన కింతాడ లక్ష్మీ (38) తన ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకొని మృతి చెందింది. కుటుంబ కలహాలకు కలత చెంది తన సోదరి లక్ష్మీ ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తమ్ముడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు.

అనాధ శవం ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో బాలాజీ లాడ్జీ ఎదురుగా మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి రహదారిపై మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. అతని వయసు సుమారు 50 నుండి 55ఏళ్లు ఉంటుందని, ఎవరైనా సమాచారం తెలిస్తే తమను సంప్రదించాలని వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు.

బొండపల్లి ఎస్ఐకి సన్మానం

బొండపల్లి: జిల్లా జంతు సంరక్షణ సమాఖ్య ఆద్వర్యంలో బొండపల్లి ఎస్ఐ కె.లక్ష్మణరావును సన్మానించారు. మంగళవారం గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ తదితర సభ్యులు ఎస్ఐకు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కానిస్టేబులు అప్పలనాయుడును కూడా అభినందించారు. ఈ సందర్భంగా లోగిష రామకృష్ణ మాట్లాడుతూ పశువులను చంపి వాటి శరీర భాగాలను తరలిస్తున్న వాహనాలను, వాటికి సంబంధించిన వ్యక్తులను అరెస్ట్ చేయడం సాహసోపేత నిర్ణయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గో సంరక్షణ నాయకులు మద్దెల సోంబాబు, పేరూరి యుగంధర్, పాండ్రింకి సంతోష్ కుమార్, కేదరశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ప్రజాశక్తి - భోగాపురం

టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. నియోజకవర్గంలోని బూత్ ఇంఛార్జిలకు సూపర్ సిక్స్ కిట్‌లను ఆయన మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని బూత్ కన్వీనర్లు అందరూ ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. ఈ ఆరు పథకాలను ప్రజలకు వివరించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఈ నెల 16వ తేదీన జరిగిన నెల్లిమర్ల శంఖారావం సభలో బూత్ కన్వీనర్లు అందరూ ప్రతిజ్ఞ చేసి ఉన్నారు కాబట్టి ఎన్ని పనులు ఉన్నా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నీలాపు అప్పలరామి రెడ్డి, తాడ్డి సత్యనారయణ , కురిమినేని దివాకర్, బోడ్డ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

Government of Andhra Pradesh
APEWIDC., Vizianagaram Division

NIT No. EE/DB/ 16 to 18/2023-24 dt. 19.02.2024.

Tenders invited from Registered Civil Contractors for NIT No. EE/DB/ 16 to 18 dt. 19.02.2024 for 3 Works at various places from Rs. 1.50 Lakhs to 2.00 lakhs.

Last date for receipt of Tenders 27.02.2024 up to 4.00 PM.

Note:- for further details can be viewed at http// Tender "e"procurement.gov.in or Contact: 9490461424.

(D.V.N. Murthy)
Executive Engineer
APEWIDC., Vizianagaram.